

గంజాయితో తెలంగాణ పోలీసులకు చిక్కిన కాకినాడ కానిస్టేబుళ్లు



తగ్గేదేలే!

అడవి అడ్డా.. గంజాయి దందా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

దట్టమైన అరణ్య ప్రాంతాల్లో వందల ఎకరాల్లో గంజాయి సాగవుతోంది. పోలీస్, ఫారెస్టు సిబ్బంది కళ్లు మూసుకొని 'కాని చేస్తుండడం'తో వేల కిలోల గంజాయి మైదాన ప్రాంతాలకు తరలిపోయి యువత జీవితాలకు పొగ పెడుతోంది. గిరిజన గ్రామాల్లో యువతకు ఇదే లాభసాటి ఉపాధి మార్గంగా మారిపోయింది. గత ప్రభుత్వం గిరిజన యువతకు ప్రత్యామ్నాయ ఉపాధిపై శ్రద్ధ చూపగా..వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారి జీవితాలు పొగచూరిపోతున్నాయి. దళారులు, ప్రభుత్వాధికారులు మామూళ్లతో ఎంజాయ్ చేస్తుంటే.. పూట గడవడం కోసం చట్టానికి వ్యతిరేకంగా వెళ్తున్న గిరిజనం జైళ్లలో మగ్గిపోతున్నారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన గంజాయి పొగ.. ఇప్పుడు పల్లెల్లో సైతం గుప్‌మంటోంది. గంజాయి విషయంలో యంత్రాంగం చెబుతున్న మాటలు చూస్తే తులసి వనానికి గంజాయి చేనుకు ఉన్నంత తేడా కనిపిస్తోంది. కాకినాడకు చెందిన కానిస్టేబుళ్లు ఏకంగా గంజాయి రవాణాకు ఉపక్రమించారంటే వ్యాపారం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. వారిని తెలంగాణ పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకోవడంతో విషయం బయటకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం కూడా గంజాయి విషయంలో ఇటు ఏపీపైనే ఎక్కువగా దృష్టి సారించినట్లు కనబడుతోంది. ఏదేమైనా ఈ నాలుగున్నరేళ్లలో ఏపీ తూర్పు మన్యం, ఏవోబీ ప్రాంతం గంజాయి హబ్‌గా మారిపోయిందనే అపవాదు ఉంది. గంజాయి మత్తుకు యువత, విద్యార్థుల జీవితాలు నిర్వీర్యం అవుతుండగా ఆరోగ్యం అడుగంటిపోతోంది.

ఏజెన్సీ నుంచి వచ్చేదిలా..

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని మంచంగిపుట్ట, పాడేరు, అరకు, చింతపల్లి, పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట, సీలేరు తదితర మండలాల్లోని దాదాపు 50 పంచాయతీల పరిధిలో 200 వరకూ మారుమూల గ్రామాల్లో సాగు చేస్తున్న గంజాయి 25 వేల ఎకరాల పైమాటే. మొత్తం మీద ఆ మన్యంలో రూ.2 వేల కోట్ల వరకూ ఏడాదికి వ్యాపారం జరుగుతుందని అంచనా. స్థానికంగా గ్రామాల్లో కిలో రూ.2 వేల నుంచి ప్రారంభమవుతుంది. నాణ్యతను బట్టి రేటు ఉంటుంది. పాడేరు, చింతపల్లిలో రూ.5వేలు, నర్సీపట్నంలో రూ.10 వేలు పలుకుతుంది. కొనుగోలుదారులు చెప్పిన ప్రాంతానికి చేరిస్తే దూరాన్ని బట్టి ధర ఉంటుంది. దళారులు ఆ బాధ్యతను నిర్వర్తిస్తారు. చింతపల్లి, నర్సీపట్నం, తుని గుండా హైవేకు.. నర్సీపట్నం, కాకరపాడు, రాజవొమ్మంగి, ఏలేశ్వరం, ఎర్రవరం దగ్గర హైవేకు.. సీలేరు, డొంకరాయి, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరం, రాజమండ్రి.. చింతపల్లి, సీలేరు, డొంకరాయి, చింతూరు, భద్రాచలం గుండా తెలంగాణకు రవాణా చేస్తున్నారు. ఏడాది పొడవునా సరఫరా జరుగుతోంది. సామర్లకోట, రాజమండ్రి రైల్వే స్టేషన్ల ద్వారా కూడా గంజాయిని తీసుకెళ్తున్నారు. తమిళనాడులోని సేలం, ఈరోడ్, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, హైదరాబాద్ ఎక్కువగా వెళుతోంది. తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్, కర్నాటక, ఒడిసా వంటి సుదూర ప్రాంతాలకు చేరిస్తే కిలోకి రూ.50వేలు, హైదరాబాద్‌లో అప్పగిస్తే రూ.20వేలు ముడుతుంది.

ఐదు నెలల్లోనే లక్షాధికారి..

ఎకరా సాగుకు రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుండగా రూ.10 లక్షల వరకూ రకం, డిమాండును బట్టి ఆదాయం వస్తోంది. సంప్రదాయ పంటలు పోయి అధునాతన సాంకేతికతతో గంజాయి పండిస్తున్నారు. ఎకరాకు 500 వరకు పాదులు పెట్టి ఒక్కో పాదులో 20 వరకూ మొక్కలు నాటతారు. వారంలో మొలకెత్తి నెలలో మొక్క దశకు వచ్చేస్తుంది. ఐదు నెలల్లో పంట చేతికొచ్చేస్తుంది. తర్వాత గంజాయిని కోసి ఆరబెడతారు. ఇళ్లలో నాణ్యత, రకం చూపించడానికి కొద్ది మొత్తంలో ఉంచి రహస్య ప్రాంతాల్లో పెద్ద మొత్తాల్లో దాస్తుంటారు. దీంతో ఏజెన్సీలో ఉండే గిరిజనేతరులు ఈ సాగుపై దృష్టి సారించారు.

మామూళ్ల మైకంలో..

గంజాయి వేల ఎకరాల్లో సాగవుతుంటే మరి పోలీసులు, ఫారెస్టు, రెవెన్యూ శాఖలు ఏం చేస్తున్నట్టు.. అక్కడ అవి ఉండవా? అనే అనుమానం రావొచ్చు. కచ్చితంగా ఉంటాయి. అయితే గంజాయి నిర్మూలనకు ఉన్నతాధికారులు ఆపసోపాలు పడుతుంటే స్థానిక సిబ్బంది మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని విధులు నిర్వర్తిస్తుంటారు. ఏజెన్సీ మండలాల్లో బేస్ క్యాంపులు ఉంటాయి. పోలీసుల చెక్‌పోస్టులు.. అటవీ సంపద అక్రమంగా తరలిపోకుండా ఫారెస్ట్ చెక్‌పోస్టులు మండలంలో 15 వరకూ ఉంటాయి. మారేడుమిల్లి, రాజవొమ్మంగి, చింతూరు, జడ్డంగి తదితర పోలీస్ స్టేషన్లు రోడ్డు పక్కనే చూస్తుంటాయి. కానీ అరకొర తప్ప భారీ తరలింపులు వాటికి కనిపించవు. గంజాయి సాగు, రవాణా వంటి విషయాలు పోలీసు, ఫారెస్టు వాళ్లకు తెలియని తంతు కాదనే వాదనా ఉంది. గంజాయి రవాణాకు సహరిస్తున్న చింతూరు ఎస్ఐ, కానిస్టేబుల్ అరెస్ట్ అయ్యారు. పోలీసులు చూసీచూడకుండా వదిలేయడానికి 'ఒప్పందాలు' ఉంటాయని..అయితే కేసుల నిమిత్తం స్వల్ప పరిమాణంలో కొంత పట్టివ్వాలనే లోపాయి కారీ విధానాలు అమల్లో ఉంటాయని స్థానికులు చెబుతుంటారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని మారుమూల గ్రామాలు కావడంతో నక్సల్స్ ప్రభావం ఉంటుంది. అది కూడా గంజాయి సాగుకు కలిసొస్తుంది. పైగా ఒకవేళ పైఅధికారులు అడిగితే మన పరిధి కాదని,అక్కడికి వెళ్లాలంటే ఫోర్సు ఎక్కువ అవస రమని స్థానిక అధికారులు తప్పుదోవ పట్టిస్తుంటారనేది బహి రంగ రహస్యం.శాటిలైట్ ఇమేజ్‌లు ద్వారా సాగు జరగడం లేదని తెలుస్తోందని పోలీసుల ఉన్నతాధికారులు చెబుతున్నా మైదాన ప్రాంతాలకు తరలిపోతున్న వేల కిలోల గంజాయి ఆ మాటలను వెక్కిరిస్తోంది.రోజూ వాహనాల్లో లేదా వివిధ మార్గాల్లో గంజాయి తరలిపోతున్నా సమాచారం వస్తేనే స్వాధీనం చేసుకుంటుండడం మరో హాస్యాస్పదమైన విషయం.

ఉపాధి కరువై

గిరిజనోద్ధరణకు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పనిచేస్తోంది. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక గిరిజనులపై పాలకుల చిన్నచూపుతో ఉపాధి కరువైంది. గత ప్రభుత్వంలో గంజాయి సాగు ధ్వంసం నిరంతరాయంగా జరిగేది. సాగు చేస్తున్న గిరిజనులకు కౌన్సెలింగ్ చేసి జీడిమొక్కల వంటివి ఇచ్చి పెట్టుబడి సహాయం చేసేది.ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించేది.కానీ ఈ ప్రభుత్వం వచ్చాక అలాంటివి పడకేశాయి. జైలు నుంచి విడుదలైన తర్వాత గిరిజనుల ఉపాధి గురించి పట్టించుకోవడం లేదు.దాంతో తప్పని పరిస్థితుల్లో గంజాయితో బతుకీడుస్తున్నారు.సాగు చేసే ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంటుంది. అక్కడి నుంచి రోడ్ పాయిం ట్‌కి చేర్చడానికి గిరిజనులనే వినియోగిస్తారు. వారికి ఇచ్చే కూలి అతి తక్కువగా ఉంటుంది.25 నుంచి 50 కిలోల బస్తాను సుమారు 25 కిలోమీటర్లు చేరిస్తే రూ.500 నుంచి వెయ్యి వరకూ ముట్టజెబుతారు.కొండల్లోని కాలిబాటల్లో నడుస్తూ రోడ్డు పాయింట్లకు గంజాయి చేరవేస్తారు.

వైసీపీ నాయకుల హవా

వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ నాయకుల అక్రమ వ్యాపా రాలకు అడ్డే లేదనేది బహిరంగ రహస్యం. గంజాయి వ్యాపారంలోనూ వారు బాగా రాణిస్తున్నారు. వైసీపీ నాయకుల బెదిరింపులు, ఆమ్యామ్యాలతో స్థానిక పోలీసులు, ఫారెస్టు సిబ్బంది రవాణాను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కొద్ది రోజుల కిందట ఓ వ్యాను దట్టమైన అటవీ ప్రాంతాన్ని దాటుకొని రోడ్డు పక్కనే ఉన్న రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లను ఎన్నో చెక్ పోస్టులను దాటుకొని దూసుకువెళ్తోంది. ఏలేశ్వరం పోలీసులు ఆ వ్యాన్‌ని ఆపి చెక్ చేశారు. ఇంకేముంది ఏకంగా 1400 కిలోల గంజాయి పట్టుబడింది. ఆరాతీస్తే ఆ గంజాయి తరలిస్తున్న వ్యక్తి రాజవొమ్మంగి సర్పంచ్‌గా పోటీ చేసిన వైసీపీ నాయకుడు. గతంలో గిరిజనం ఎక్కువగా పేకాట, మద్యానికి అలవాటు పడేవారు. ఇప్పుడు గంజాయి విరివిరిగా దొరుకుతుండడంతో వినియోగంతో పాటు ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు.

సెంట్రల్ జైలులోనే 600 మంది

ముగ్గురు అమాయక గిరిజన మహిళలు గంజాయితో రాజమహేంద్రవరం ఎస్ఈబీ పోలీసులకు పట్టుబడ్డారు. కనీసం వారి కాళ్లకు చెప్పులు కూడా లేవు. ఆ గంజాయిని విజయవాడలో అప్పగిస్తే రూ.2వేలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. ఇలా గంజాయి దందాలో అమాయక గిరిజనం జీవితాలు చిత్తవుతున్నాయి. ముఖ్యంగా యువత జీవితాలు నాశనమవుతున్నాయి. గంజాయిని తరలించే క్రమంలో అనుమానం రాకుండా ఉండడానికి మహిళలను రంగంలోకి దింపుతున్నారు. అమాయక గిరిజనులు పోలీసులకు పట్టుబడుతూ జైళ్లలో మగ్గిపోతున్నారు. పెట్టుబడిదారులు, స్మగ్లర్లు 'ఎందుకనో' పోలీసుల చేతికి చిక్కడం లేదు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో ఉన్న రిమాండు/శిక్షపడిన ఖైదీలు సుమారు 600 మంది ఉన్నారు. వాళ్లలో కొందరికి బెయిల్ వచ్చినా పూచీకత్తులు సమర్పించుకొనే స్తోమత లేక కటకటాల్లో మగ్గిపోతున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిబంధనల ప్రకారం సహాయం అందిస్తోంది. గిరిజనుల కోసం ఉన్న కమిషన్లు, వ్యవస్థలు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియని పరిస్థితి. ఏజెన్సీలో అత్యంత తక్కువ ధరకు దొరకడంతో స్థానికంగా వినియోగం కూడా బాగా ఎక్కువైంది.

- గంజాయి మత్తు..జీవితాలు చిత్తు
- పల్లెల్లో కూడా గుప్పు గుప్పు
- అడవిలో కిలో రూ.2 వేలు
- సేలం చేరిస్తే రూ.50 వేలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- చూసిచూసి పోలీసులదీ అదే బాట
- గంజాతో చిక్కిన కాకినాడ పోలీసులు
- తూతూమంత్రంగా తనిఖీలు
- రెచ్చిపోతున్న స్మగ్లర్లు
- ఉపాధిలేక సాగు వైపు గిరిజనం
- గతంలో ప్రత్యామ్నాయంపై చొరవ
- ఇప్పుడు జైళ్ల పాలు చేస్తున్న ప్రభుత్వం

పోలీసులే..కళ్లు గప్పి..

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది.అక్రమ నిల్వలను పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకుంటున్నారు. అయినా సరే గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఏజెన్సీలోని నక్సల్స్ కార్యకలాపాల అదుపు, శాంతి భద్రతల కోసం ఏపీఎస్పీ బెటాలియన్‌నుంచి పలు ట్రూపులు వెళ్లి వస్తుంటాయి. ఏజెన్సీలో కిలో గంజాయి రూ.2 వేల నుంచి రూ.3 వేలకు లభించడంతో వీటిని దూర ప్రాంతానికి తీసుకెళ్లి రూ.15వేలకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. పోలీసుల ముసుగులో సులువుగా డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశంతో వీరు సెలవు పెట్టి మరీ అక్రమ గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం. గంజాయి తరలింపులో ఎక్కడెక్కడ చెక్‌పోస్టులు, తనిఖీలు ఉంటాయి, పోలీసులు కళ్లు కప్పి ఎలా తప్పించుకోవచ్చనే దానిపై వీరు పక్కా ప్రణాళికతో కొంతకాలంగా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వ్యవహారంలో ఇద్దరు పట్టుబడడంతో వీరు పైకి నిందితులుగా కనిపిస్తున్నారని,లోతుగా విచారణ నిర్వహిస్తే మరింత మంది గంజాయి అక్రమ రవాణా వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నా యని పలువురు భావిస్తున్నారు.ఎస్పీ, అదనపు కమాండెంట్ లోతుగా విచారణ నిర్వహించాలని కోరుతున్నారు.

కంచే చేను మేసింది..

ఉలిక్కిపడ్డ జిల్లా పోలీస్ యంత్రాంగం

సర్పవరం జంక్షన్/కాకినాడ క్రైం/ప్రత్తిపాడు, ఫిబ్రవరి 2: క్రమశిక్షణకు మారుపేరుగా,పోలీసు శిక్షణ, విధి నిర్వహణలో అం కితభావంతో పనిచేసే వ్యవస్థగా రాష్ట్రంలోనే ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు పేరుంది.అంతటి ఖ్యాతి ఉన్న కాకినాడ ఏపీ ఎస్పీ బెటాలియన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు 22 కిలోల గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ గురువారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసులకు అడ్డంగా దొరకడం పోలీసు వర్గాల్లో సంచలనం రేకెత్తించింది. తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో హెడ్‌కానిస్టేబుల్ సాగర్ పట్నాయక్, కానిస్టేబుల్ శ్రీనివాస్ ఉన్నారు. వీరిని బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేసి గంజాయితో పాటు వాహనాన్ని సీజ్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చిం ది. కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో విశాఖకు చెందిన సాగర్ పట్నాయక్(2013 బ్యాచ్) హెడ్‌కానిస్టేబుల్‌గా, ప్రత్తిపాడుకు చెందిన శ్రీనివాస్ (2009) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు.ఇందులో శ్రీనివాస్ విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడం,సెలవులు తరచుగా పెట్టడంతో పలుసార్లు శాఖాపరమైన చర్యలకు గురయ్యాడు. వీరిద్దరూ డీ గ్రూప్‌లో పనిచేస్తున్నారు.వీరు మెడికల్ లీవ్ పేరుతో సెలవుపెట్టి నెలరోజులుగా విధులకు రావడం లేదు. గురువారం రాత్రి మారుతీ వాహనంలో 22కిలోల గంజాయిని 11 ప్యాకెట్లతో వెళ్తుండగా హైదరాబాద్‌లోని బాచుపల్లిలో తెలంగాణపోలీసులు పట్టుకోవడం సంచలనం రేకెత్తించింది. పప్పల శ్రీనివాస్ స్వగ్రామం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాథపురం (యుజేపురం) కావడంతో ఆ గ్రామంలో కలకలం రేగింది.

సమగ్ర విచారణకు ఆదేశం

గంజాయి అక్రమ రవాణా కేసులో పట్టుబడ్డ ఇద్దరు కానిస్టేబుల్స్‌పై సమగ్ర విచారణకు ఆదేశించాం. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. సాగర్ పట్నాయక్, శ్రీనివాస్ ఇద్దరూ జనవరి 2వతేదీ నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నారు.

- ఎస్.సతీష్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ



ఖరీఫ్‌కు రూ.45వేలు.. రబీకి రూ.49వేల వరకు

పంట రుణాలు

- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ప్రకటించిన జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 2: జిల్లా వ్యాప్తంగా 2024-25 సంవత్సరానికి సాగులో ఉన్న పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్‌అజయ్ తెలిపారు. జిల్లా యంత్రాంగం, బ్యాంకర్ల సమన్వయంతో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించినట్టు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పంట సాగుకు ఎకరాకు రూ.38వేలు నుంచి రూ.45 వేల వరకు, రబీ సీజన్‌లో రూ.42వేల నుంచి రూ.49వేల వరకు పంట రుణ పరిమితి నిర్ణయించామన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జేసీ అధ్యక్షతన బ్యాంకర్లు, జిల్లా అధికారుల సమన్వయంతో జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ నిర్ణయాల మేరకు స్థానిక వ్యవసాయ పెట్టుబడులను వ్యవసాయాధికారుల ద్వారా ప్రతిపాదనలను క్రోడీకరించి రుణ పరిమితులను నిర్ణయించామన్నారు. పప్పుధాన్యాల పంటల సాగుకు రూ.17వేల నుంచి రూ.20వేల వరకు, వేరుశనగ పంటకు రూ.24వేల నుంచి రూ.32వేల వరకు, మిరప పంటకురూ.30వేల నుంచి రూ.35వేల వరకు, అరటి సాగుకు రూ.75వేల నుంచి రూ.85వేల వరకు బ్యాంకులు పెట్టుబడి రుణాన్ని అందించే విధంగా నిర్ణయించామన్నారు. అరటి టిష్యూకల్చర్‌కు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు, జామ, బొప్పాయిపంటల సాగుకు రూ.35వేల నుంచి రూ.40వేల వరకు, కొబ్బరి సాగుకు రూ.50వేల నుంచి రూ.60వేల వరకు, కొబ్బరిలో అంతర పంటలైన కోకో సాగుకు రూ.75వేల నుంచి రూ.95వేల వరకు, కూరగాయల సాగుకు రూ.20వేల నుంచి రూ.40వేల వరకు, ఆకు కూరల సాగుకు రూ.1.20లక్షల నుంచిరూ.1.30లక్షల వరకు రుణ పరిమితి నిర్ణయించామన్నారు. అదే విధంగా పౌల్ట్రీ యూనిట్లు, మత్స్య సాగుకు సంబంధించి పెట్టుబడి రుణాలను కమిటీ నిర్ణయించిందన్నారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో ఆర్వీ నరసింహారావు, ఎల్‌డీఎం కె.శ్యామ్‌బాబు, డీజీవో శ్రీధర్‌చౌదరి, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఉద్యానవన అధికారి వీవీ రమణ, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, నాబార్డు డీజీఎం స్వామినాయుడు, పశుసంవర్ధక శాఖ అధికారి ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త తహసీల్దార్లు వీరే

- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పలువురు కోనసీమ జిల్లాకు బదిలీ

అమలాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. పూర్వపు పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పలువురు తహసీల్దార్లను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా విడుదల చేసిన ప్రకటన ప్రకారం మండలాల వారీగా తహసీల్దార్ల నియామకం ఇలా జరిగింది.. విజయవాడ ఈస్ట్ తహసీల్దారు ఎం.వెంకటరామయ్యను అమలాపురం, సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసర్ పి.సునీల్‌కుమార్‌ను అల్లవరం, కృష్ణా జిల్లా ల్యాండ్ రిఫామ్స్ నుంచి పి.మల్లికార్జునరావును ఉప్పలగుప్తం, పాలకోడేరు నుంచి ఎస్కే.హుస్సేన్‌ను పి.గన్నవరం, కుక్కునూరు నుంచి డీఎల్ ప్రమద్వార్‌ను అయినవిల్లికి, నాగాయిలంక నుంచి జె.విమలకుమారిని అంబాజీపేటకు, కొవ్వూరు కేఆర్సీ నుంచి ఎం.మేరికమ్మను మామిడికుదురు, ఏలిటిపాడు నుంచి జి.ఎలీషాను కొత్తపేట, పెనుమంట్ర నుంచి డీవీఎస్ఎస్ అశోక్‌వర్మను రావులపాలెం, తాళ్లపూడి నుంచి టి.రాధికను ఆత్రేయపురం, చల్లపల్లి నుంచి కె.గోపాలకృష్ణను ఆలమూరు, రెడ్డిగూడెం నుంచి ఎం.పౌల్‌ను రాజోలుకు, మొగల్తూరు నుంచి జి.అనితకుమారిని మలికిపురం, పాలకొల్లు నుంచిజి.పెద్దిరాజును సఖినేటిపల్లి, గోపాలపురం నుంచి బి.రవీంద్రనాథ్‌ను కె.గంగవరం, కృష్ణా జిల్లా కలెక్టరేట్ నుంచి ఎం.సురేష్‌కుమార్‌ను మండపేట, పోడూరు నుంచి పీవీ కృష్ణారావును రాయవరం, మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం నుంచి కేజీఎస్ సోమేశ్వరరావును కపిలేశ్వరపురం, కృష్ణా జిల్లా నుంచి బి.శ్రీనునాయక్‌ను ముమ్మిడివరం, మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం నుంచి డి.క్రాంతిని కాట్రేనికోన, ఘంటసాల నుంచి బి.రమానాయక్‌ను ఐ.పోలవరం, సఖినేటిపల్లి నుంచి వై.రామకుమారిని కొత్తపేట ఆర్డీవో కార్యాలయానికి, కె.గంగవరం నుంచి టి.వైద్యనాథశర్మను అమలాపురం కలెక్టరేట్‌కు, ఆచంట నుంచి ఎస్వీ సుబ్రహ్మణ్యాన్ని అమలాపురం కలెక్టరేట్‌కు, మొవ్వ నుంచి సీహెచ్ వీరాంజనేయప్రసాద్‌ను అమలాపురం ఆర్డీవో కార్యాలయానికి, ఆత్రేయపురం నుంచి డీవీఎస్ అనిల్‌కుమార్‌ను రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారు.

వంతెన నిర్మాణాన్ని గడువులోపే పూర్తి చేస్తాం: పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ బాలునాయక్

పి.గన్నవరం, ఫిబ్రవరి 2: గంటి పెదపూడి, ఉడిమూడి శివారు గ్రామాల ప్రజల కోసం తలపెట్టిన వంతెనను నిర్దీత గడువులోపే పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ బాలునాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన గంటి పెదపూడిలో వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నిబంధనలను అనుసరించి సంబంధిత కాంట్రాక్టర్ పనులు జరిపిస్తున్నారన్నారు. ప్రస్తుతం మూడు కల్వర్టు బాక్సులు పూర్తయ్యాయని తెలిపారు. యంత్ర పరికరాల వినియోగంలో మహిళల పాత్ర కూడా ఉండాలని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సూచించారు. ఈ నేపథ్యంలో మహిళలు యంత్రాలతో చేస్తున్న పనులను బాలునాయక్ పరిశీలించి వారిని అభినందించారు. భూసేకరణలో భాగంగా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇంకా రాకపోయినప్పటికీ వంతెన నిర్మాణానికి సహకరిస్తున్న రైతులను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈఎన్‌సీ వెంట ఎస్ఈ పాండురంగమూర్తి, బీవీఎస్ మూర్తి, ఈఈ కె.చంటిబాబు, డీఈఈ అన్నం రాంబాబు వున్నారు.



వంతెన పనులను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ బాలునాయక్

ఓటరు జాబితాలో లోపాలను గుర్తిస్తే...

జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల సవరణ ప్రక్రియలో అన్ని రాజకీయ పక్షాలు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. ఓటరు జాబితాలో లోపాలను గుర్తించినట్టయితే ఆయా అంశాలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించేందుకు కచ్చితత్వంతో కూడిన ఓటరు జాబితా ఎంతో అవసరమని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. వయోజనులకు ఓటు హక్కు కల్పించడానికి అందరూ సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాలో లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దే చర్యలు చేపట్టామన్నారు. సాక్ష్యాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ముమ్మిడివరం, మండపేట, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల నమోదు అధికారుల బదిలీల కారణంగా అధికారులు మారారని వివరించారు. సమావేశంలో సంసాని నాని (వైసీపీ), దూరి రాజేష్ (బీజేపీ), అల్లాడ స్వామినాయుడు (టీడీపీ), వడ్డి నాగేశ్వరరావు (కాంగ్రెస్), కారెంవెంకటేశ్వరరావు (సీపీఎం), ఎన్నికల సిబ్బంది సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్‌కు ఊరట

- బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయింపు

... 7లో



కోనసీమ జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వాసా ఎస్.దివాకర్

కోనసీమ జేఏసీ కార్యవర్గం హర్షం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 2: కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌కు 2024-25 రైల్వే బడ్జెట్‌లో రూ.310 కోట్లు కేటాయించడంపై కోనసీమ జేఏసీ కార్యవర్గ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. జేఏసీ చైర్మన్ వాసా ఎస్.దివాకర్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. రైల్వేలైన్ నిర్మాణానికి రూ.300 కోట్లు, కాకినాడ-కోటిపల్లి ట్రాక్ పునరుద్ధరణకు రూ.10కోట్లు కేటాయించడంపై చిన్న వంతెన వద్ద సంబరాలు నిర్వహించారు. కన్వీనర్ బండారు రామ్మోహనరావు మాట్లాడుతూ రైల్వే లైన్ నిర్మాణ పనులు త్వరితగతిన జరగడానికి ఈ నిధులు దోహదపడతాయన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన రాంమాధవ్‌తో పాటు ఎంపీ చింతా అనురాధకు కృతజ్ఞతలు తెలిపారు. సహ కన్వీనర్ మంత్రిప్రగడ వేణుగోపాల్, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, పమ్మి నాగేశ్వరరావు, ముత్యాల శరత్‌బాబు, ఉండ్రు బాబ్జీ, కరాటం ప్రవీణ్, వరసాల సత్యనారాయణ, కరాటం సూరిబాబు, అబ్బిరెడ్డి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' చేయాల్సిందే!

- ఏలూరులో జగన్ సిద్ధం సభకు ప్రభుత్వం అధికార దుర్వినియోగం
- నిర్వహించేది వైసీపీ సభే అయినా అధికారులు దగ్గరుండి మరీ ఏర్పాట్లు

... 7లో

'సిద్ధం' చేయాల్సిందే!

కాకినాడ జిల్లాలో...

- ఏలూరులో జగన్ సిద్ధం సభకు ప్రభుత్వం అధికార దుర్వినియోగం
- నిర్వహించేది వైసీపీ సభే అయినా అధికారులు దగ్గరుండి మరీ ఏర్పాట్లు
- కాకినాడ జిల్లాలో అన్ని ప్రైవేటు కాలేజీల బస్సులు లాగేసుకున్న రవాణాశాఖ
- ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలకు సైతం బలవంత సెలవు.. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష రద్దు
- ఒక్కో నియోజకవర్గానికి 50 చొప్పున బస్సులు... 5 వేల జనం తరలింపు

(కాకినాడ -ఆంధ్రజ్యోతి)

సీఎం జగన్ పర్యటన అంటే ప్రజలకు రోతెక్కుతోంది. ఎక్కడికక్కడ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేయడంతోపాటు ఏకంగా కాలేజీల బస్సులు లాగేసుకోవడం, స్కూళ్లు, కాలేజీలకు బలవంతంగా సెలవులు ఇచ్చేస్తూ అధికారులు స్వామిభక్తి చాటుకుంటుండడం వివాదాస్పదమవుతోంది. అటు జగన్ పర్యటించే ప్రాంతాల్లో చెట్లు కూడా నరికేస్తుండడం, ప్రజలు ఎక్కడ తిరగబడతారోననే భయంతో రోడ్లకు ఇరువైపులా బారికేడ్లు నిర్మించడం వంటి చర్యలు తీవ్ర విమర్శలకు తావిచ్చాయి. అయినా జనం తిట్టుకుంటే మాకేంటి అనే ధోరణితో ప్రభుత్వం, అధికారులు పద్ధతి మార్చుకోకుండా అడ్డగోలుగా వ్యవహరిస్తునే ఉన్నారు. ఇప్పటివరకు కాకినాడ జిల్లాలో గడచిన రెండేళ్ల వ్యవధిలో గొల్లప్రోలు, పెద్దాపురం, కాకినాడలో సీఎం జగన్ అధికారిక పర్యటనల పేరుతో అధికారులు వ్యవహరించిన తీరు దుమారం రేపింది. అయితే ఇప్పుడు తాజాగా జిల్లాతో సంబంధం లేని జగన్ సభకు అధికారులు అన్నీ తామై వ్యవహరించడం అందరినీ ముక్కున వేలేసుకునేలా చేస్తోంది. అసలే ఎన్నికలు దగ్గర పడ్డ తరుణంలో జగన్ శనివారం ఏలూరుతో పార్టీ తరపున సిద్ధం పేరుతో బహిరంగసభ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా కేవలం ఎన్నికల ప్రచారం కోసం నిర్వహిస్తున్న సొంత కార్యక్రమం. కానీ అధికారులు మాత్రం ప్రభుత్వం ఆదేశాలతో అన్ని రకాల వసతులు జిల్లా నుంచి సమకూర్చుతున్నారు. అందులోభాగంగా రవాణాశాఖ జిల్లావ్యాప్తంగా 42 ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల నుంచి బలవంతంగా బస్సులు లాగేసుకుంది. ఒక్క ఆదిత్య, శ్రీచైతన్య ప్రగతి తదితర ప్రముఖ కాలేజీల నుంచే వందల బస్సులను అధికారులు తీసేసుకున్నారు. మండలాల్లోని పలు స్థానిక ప్రైవేటు కాలేజీలు, స్కూళ్లను సైతం బెదిరించి బస్సులను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అలాగే శనివారం అన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలకు సైతం అధికారులు బలవంతంగా సెలవులు ఇచ్చేశారు. వాస్తవానికి జిల్లాలో శనివారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఉన్నాయి. కానీ సీఎం జగన్ సభ కోసం వీటిని రద్దు చేసేశారు. అలాగే లాక్కున్న బస్సులు ఏ మూలకూ చాలకపోవడంతో గడచిన మూడురోజులుగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేటు టూరిస్ట్ బస్సులు, మినీ బస్సులను కూడా రవాణాశాఖ అధికారులు లాగేసుకున్నారు. దీంతో ఆయా యజమానులు లబోదిబోమంటున్నారు. కాగా వైసీపీ సొంత సభకు జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి ప్రభుత్వం తరపున అధికారులు తాము లాక్కున్న బస్సుల్లో 50 చొప్పున తరలిస్తున్నారు. సొంతంగా ఈ బస్సులు డీజిల్ కొట్టించుకుని చెప్పిన నియోజకవర్గానికి వెళ్లి జనాలను ఎక్కించుకుని ఏలూరు వెళ్లి రావాలని అధికారులు ఆయా యజమానులను బెదిరించారు. కాగా సిద్ధం సభకు జిల్లాలో ఒక్కో నియోజకవర్గం నుంచి 5 వేల మంది జనాలను తరలించాలని పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జులను వైసీపీ అధిష్ఠానం ఆదేశించింది. ప్రభుత్వం తీరుతో జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు లబోదిబోమంటున్నాయి. సీఎం వస్తున్న ప్రతిసారీ బస్సులను లాగేసుకోవడమే కాకుండా డీజిల్ ఖర్చులు కూడా తమనే భరించాలని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల కిందట గొల్లప్రోలు సభకు పంపిన బస్సులకు ఇస్తామన్న డీజిల్ డబ్బులు కూడా ఇవ్వకపోవడం, అడిగితే బెదిరిస్తుండడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో...

జగన్ సభకు 300 ఆర్టీసీ బస్సులు

- ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి కేటాయింపు
- ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు 600 పైనే లాక్కున్నవైనం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2: ముఖ్యమంత్రి ఏలూరు పర్యటన ఆర్టీసీ ప్రయాణికులకు కష్టాలు తెచ్చిపెట్టనుంది. శనివారం జరిగే సీఎం సభ కోసం జనాలను తరలించడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఏలూరు పంపిస్తుండగా, వీటిలో పల్లెవెలుగు బస్సులే అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. దీంతో పల్లె ప్రజానీకం ప్రయాణ అవసరాల కోసం నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యమంత్రి సభకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 300కు పైగా ఆర్టీసీ బస్సులను ఏలూరు పంపిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి 90కి పైగా బస్సులు ఏర్పాటుచేశారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం బస్సులు దాదాపుగా 300 వరకూ ఉన్నాయి. వీటిలో 90కి పైగా బస్సులు ఏలూరు పంపడంతో ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు. అలాగే కాకినాడ జిల్లా నుంచి సుమారు 90, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి 100కి పైగా బస్సులు ఏలూరు సీఎం సభకు పంపిస్తున్నారు. ఇలా పెద్ద సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేయాల్సి రావడంతో ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు కూడా...

ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను భారీ సంఖ్యలో సీఎం సభకు తరలించడానికి సిద్ధం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రముఖ ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన సుమారు 600కు పైగా బస్సులు చలో ఏలూరు నడుపుతున్నారని చెబుతున్నారు. దీంతో సీఎం సభ అంటేనే అటు ఆర్టీసీ అధికారులు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటుండగా, ఇటు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

నేటి ఇంటర్ పరీక్ష వాయిదా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శనివారం జరగాల్సిన ఇంటర్ మొదటి ఏడాది పర్యావరణ విద్య పరీక్షను ఈనెల 23న నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్వీఎల్ నరశింహం తెలిపారు. కాగా 2న జరిగిన నైతికత మానవీయ విలువలు పరీక్షకు 21,195 మంది హాజరుకాగా 168 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 5 నుంచి 20 వరకూ.. జనరల్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ఈ నెల 11 నుంచి 20 వరకూ ప్రాక్టికల్స్ పరీక్షలు 76 సెంటర్లలో జరుగుతాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని.. విద్యార్థులు అందరూ తమ సెషన్లలో హాజరుకావాలని ఇంటర్ బోర్డు జోన్-1, 2 ఆర్జేడీ ఐ.శారద ఒక ప్రకటనలో కోరారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో...

స్కూళ్ల యాజమాన్యాలకు చేతి'చమురు'

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఏలూరు జిల్లా దెందులూరులో వైసీపీ నిర్వహించే 'సిద్ధం' సభ కోసం భారీగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీపరంగా జరిగే సిద్ధం సభ కోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అమలాపురం, రావులపాలెం, రామచంద్రపురం, రాజోలు డిపోల పరిధిలో 110 ఆర్టీసీ బస్సులను సభ కోసం సిద్ధం చేశారు. వీటిని నియోజకవర్గాల వారీగా 20 నుంచి 30 బస్సుల వంతున కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు కేటాయించారు. ఇవికాకుండా ఆయా నియోజకవర్గాల పరిధిలో ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలలతోపాటు వివిధ ప్రైవేటు స్కూళ్ల బస్సులను రవాణాశాఖ అధికారుల ఒత్తిడితో సిద్ధం చేశారు. రాజోలు నియోజకవర్గంలో ప్రైవేటు స్కూలు బస్సులకు ఆయిల్ కొట్టి పంపించాలని వైసీపీ నేతలు స్కూలు యాజమాన్యాలను ఆదేశించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈమేరకు సోషల్ మీడియాలో జనసేన, టీడీపీ నేతలు ప్రచారాస్త్రాలు సంధించారు. ఇక స్కూళ్లు, కళాశాలలకు కొన్నింటికి సెలవులు ఇచ్చారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్‌కు సంబంధించి ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఆయా కళాశాలల బస్సులను వైసీపీ సభ కోసం తరలించడం వల్ల పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. నియోజకవర్గాల వారీగా సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక గ్యాలరీలు కేటాయించడంతో కచ్చితంగా పార్టీ శ్రేణులను అక్కడికి తరలించి ఆ ప్రాంగణాలను నింపుకోవడం ద్వారా బల ప్రదర్శనలో ముందంజలో ఉన్నారని పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకు తగిన రీతిలో ఎక్కడికక్కడే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉదాహరణకు కొత్తపేట నియోజకవర్గ పరిధిలో 35 ఆర్టీసీ, మరో 40 వరకు స్కూలు బస్సుల ద్వారా జనాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులను జిల్లా వ్యాప్తంగా 110 సర్వీసులను ఒక్కసారిగా రద్దు చేయడం వల్ల ప్రయాణికులను ప్రైవేటు స్కూలు బస్సులను విద్యార్థులు సైతం ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. అయినా సరే అధికార యంత్రాంగం అటు బస్సులు సమకూర్చడం నుంచి ఇటు జన సమీకరణ వరకు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల విద్యార్థులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బస్సుల్లోనే బిర్యానీ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లను సిద్ధం చేసుకుంటున్నారు.

నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్‌కు ఊరట

బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయింపు.. రైల్వే మూడు వంతెనల పనులన్నీ పూర్తయ్యే అవకాశం



నరసాపురం, ఫిబ్రవరి 2: కేంద్రం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు పెద్ద ఊరట లభించింది. గత కొంత కాలంగా నిధులు లేక నిలిచిన కోటిపల్లి రైల్వే లైన్ పనులకు రూ.300 కోట్లు కేటాయించారు. దీంతో పనులు మళ్లీ ఊపందుకోనున్నాయి. కోటిపల్లి - నరసాపురం రైల్వే ప్రతిపాదన బ్రిటిష్ హాయం నుంచి ఉంది. అయితే 2000వ సంవత్సరం నుంచి ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా ప్రతి బడ్జెట్‌లోనూ సర్వేకు మాత్రమే నిధులిస్తూ రైల్వేశాఖ చేతులుదులుపుకుంటూ వచ్చింది. అయితే రాష్ట్ర విభజన తరువాత కేంద్రం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఒత్తిడితో కేంద్రం ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. సుమారు 57 కిలోమీటర్ల మేర చేపట్టే కొత్త రైల్వే లైన్ నిర్మాణ పనులకు రూ.2120 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతాన్ని వ్యయాన్ని భరించాల్సి ఉంది. ఈ మేరకు రైల్వే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.1150 కోట్లు కేటాయించింది. దీనిలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.350 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. దీంతో గత కొంతకాలంగా పనులు నిలిచిపోయాయి. రైల్వే అధికారులు స్వయంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కలిసి నిధులు విడుదల చేయాలని విన్నవించారు. అయినా స్పందన లేదు. దీంతో బడ్జెట్‌పైనే ఆధారపడ్డారు. ఇప్పటివరకు కేంద్రం ప్రతి బడ్జెట్‌లోనూ ఈ ప్రాజెక్టుకు నిధులిస్తూ వచ్చింది. మొదటి బడ్జెట్‌లో రూ.450 కోట్లు ఇచ్చిన కేంద్రం, గత ఏడాది రూ.100 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెండింగ్ నిధులు ఇవ్వకపోవడంతో పనులు పెండింగ్ పడ్డాయి. ఈ కొత్త రైల్వే ప్రాజెక్టులో గోదావరిపై మూడు చోట్ల వంతెనలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే కోటిపల్లి వంతెన పనులు పూర్తయ్యాయి. పాచర్లపూడి, చించినాడ వద్ద వంతెన పనులు 60 శాతం మాత్రమే అయ్యాయి. ఇటు భూసేకరణ కూడా 80 శాతం వరకు పూర్తయింది. వంతెన నిర్మాణాలు పూర్తయితే కొత్త ట్రాక్ పనులే మిగులుతాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రాజెక్టు 2021 నాటికి పూర్తి కావాల్సి ఉంది. అయితే నిధుల కొరత, కొవిడ్ కారణంగా ముందుకు సాగలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిపెట్టలేదు. ప్రస్తుతం ఓటాన్ బడ్జెట్‌లో కేంద్రం ఈ ప్రాజెక్టుకు పెద్దపీట వేయడంతో గౌతమి, వైనాతేయి, వశిష్ఠా నదులపై పెండింగ్ వంతెన్ల పనులు వేగవంతం కానున్నాయి. ఇటు బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఎన్నికల బదిలీల్లో మంత్రి విశ్వరూప్ బంధుప్రీతి

- అధికార పార్టీకి ప్రయోజనం చేకూర్చేలా పోస్టింగులు
- కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన హరీష్‌మాధుర్

అమలాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగే బదిలీల్లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ బంధుప్రీతి ప్రదర్శించడంతోపాటు అధికార పార్టీకి ప్రయోజనం చేకూర్చేలా భార్యాభర్తలకు పోస్టింగులు ఇచ్చారంటూ కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు శుక్రవారం టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మంత్రి విశ్వరూప్ సమీప బంధువులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రాధాన్యతా పోస్టులు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రస్తుతం అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న జనుపల్లి స్వర్ణను ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ అమలాపురం తహసీల్దారు కార్యాలయానికి బదిలీచేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె మంత్రి విశ్వరూప్‌కు స్వయానా మేనకోడలు. ఉప్పలగుప్తం ఎస్ఐగా మొన్నటివరకు పనిచేసిన జి.వెంకటేశ్వరరావుకు సోషల్ మీడియా విభాగం సీఐగా పదోన్నతి కల్పించి అమలాపురం ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారని, వీరిద్దరూ భార్యభర్తలని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఇటువంటి నియామకాలు చేపట్టడం వల్ల పారదర్శకత లోపిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘంతోపాటు ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పురోహితుల క్రికెట్ లీగ్‌ను ప్రభుత్వం గుర్తించేలా కృషి

రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్.. ముగిసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్

అంబాజీపేట, ఫిబ్రవరి 2: సమాజంలో మంచి గుర్తింపు ఉండి నిత్యం వేదపఠనం, పూజలు, యజ్ఞయాగాదులతో బిజీగా ఉండే పురోహితుల్లో ఉండే నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పురోహితుల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు టీకే విశ్వనాథ్ టాస్ వేశారు. మ్యాచ్‌లో కొవ్వూరు, కాకినాడ జట్ల మధ్య హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో 8 పరుగులు తేడాతో కాకినాడ జట్టు విజయం సాధించింది. విన్నర్స్‌గా కాకినాడ జట్టు నిలవగా కొవ్వూరు జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఉపద్రష్ట నాగాదిత్య అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్, విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్, విష్ణువర్ధన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పురోహితుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రభుత్వం నిర్వహించేవిధంగా సీఎం జగన్‌తో మాట్లాడ్డం జరుగుతుందని వివరించారు. ప్రతిఏటా పురోహితుల రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించుకునేందుకు సీఎస్ఆర్ నిధులు రూ.5 లక్షలు అందించడం జరుగుతుందని మంత్రి విశ్వరూప్ హామీ ఇచ్చారు. అనంతరం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లను మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌కు వివరించారు. తొలుత టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్ సెమిఫైనల్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం జరిగిన సభలో కాకినాడ జట్టుకు విన్నర్స్‌గా ప్రకటించి రూ.50 వేల చెక్కు, ట్రోఫీని అందించగా, కొవ్వూరు జట్టుకు రన్నర్స్ కప్, రూ.30 వేల చెక్కును అందించారు. అలాగే సెమి ఫైనల్స్‌కు వచ్చిన కాకినాడ, కొవ్వూరు, విజయవాడ, ఖమ్మం జట్లుకు రూ.10 వేల వంతున నగదును అందించారు. అలాగే బెస్ట్‌బ్యాట్స్‌మెన్, బౌలర్, మ్యాన్‌ఆఫ్ ది సిరీస్, పెయిర్ ఆఫ్ ప్లేయర్‌కు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు పి.రఘురామ్, రాష్ట్ర పురోహిత సంఘం గౌరవాధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, గణపతి వీరరాఘవులు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, బొంతు పెదబాబు, పేరి శ్రీను, దొమ్మేటి సత్యమోహన్, నిర్వాహకులు ఉపద్రష్ట విజయ్, కర్రా బాబి, అక్షయ్, మహేంద్ర పాల్గొన్నారు.

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.35,76,652



బాలబాలాజీ హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, ఫిబ్రవరి 2: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి హుండీ ఆదాయం రూ.35,76,652 వచ్చినట్టు సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. 64 రోజులకుగాను హుండీ లెక్కింపును శుక్రవారం నిర్వహించగా నగదుతోపాటు 14 గ్రాముల బంగారం, 143 గ్రాముల వెండి వచ్చిందని ఏసీ తెలిపారు. హుండీ లెక్కింపు అమలాపురం ఆలయాల తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ గెడ్డం కృష్ణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళమందిస్తున్న మద్దినేని దంపతులు

అంతర్వేది, ఫిబ్రవరి 2: అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో స్వామి దర్శనం అనంతరం స్వామివారి నారసింహ సుదర్శన హోమానికి శాశ్వత విరాళం కింద విజయవాడకు చెందిన మద్దినేని రామకిషన్-లక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు. విరాళమందించిన దాతలకు ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, ఆలయ సిబ్బంది సత్యకిరణ్ పాల్గొన్నారు.




కళాశాల చైర్‌పర్సన్ నాగమణిని దుశ్శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం

దంత సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం

డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్ కుమార్‌రెడ్డి.. కేఎల్ఆర్ లెనోరా దంతవైద్య కళాశాలలో రాష్ట్ర సదస్సు

రాజానగరం, ఫిబ్రవరి2: దంతాలను సంరక్షించుకోవడం ద్వారా ప్రతి మనిషికి సంపూర్ణ శరీర ఆరోగ్యం చేకూరుతుందని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇండియన్ ప్రోస్థోడాంటిక్ సొసైటీ (కృత్రిమ దంతాల విభాగం) ఏపీ శాఖ ఆధ్వర్యంలో రాజానగరంలోని కేఎల్ఆర్ లెనోరా దంతవైద్య కళాశాలలో రెండు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపూర్ణ శరీర ఆరోగ్యానికి ఆరోగ్యకరమైన దంతాల దోహదపడతాయన్నారు. సదస్సులో ప్రపంచ, జాతీయ స్థాయి నిష్ణాతులైన వైద్య నిపుణులు దంత వైద్య రంగంలో వస్తున్న ఆధునిక వైద్య విధానాలు, చికిత్సా పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే 65 సైంటిఫిక్ పేపర్లను ఫ్యాకల్టీ మెంబర్లు, పీజీ విద్యార్థులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కేఎల్ఆర్ గ్రూపు విద్యాసంస్థల అధినేత్రి నాగమణి, కార్యదర్శి వై.మధుసూదనరెడ్డి, ఐపీఎస్ కార్యదర్శి డాక్టర జంగాల హరి, సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఐపీఎస్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్, కార్యదర్శి డాక్టర్ శేషారెడ్డి, లెనోరా దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వప్రకాష్‌శెట్టి, సదస్సు నిర్వాహకులు టీఎస్వీ సత్యనారాయణ, డాక్టర్ సుధీర్ కొండక, వివిధ రాష్ట్రాలకు చెందిన 215 మందికి పైగా ప్రోస్థోడాంటిక్ నిపుణులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారిపై పిచ్చికుక్క దాడి



రంగంపేట, ఫిబ్రవరి, 2: మండలంలోని వెంకటాపురంలో ఏడాదిన్నర వయసున్న బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసింది. బీసీ కాలనీకి చెందిన శీలం శ్రీను కుమారుడు హర్షవర్ధన్ శుక్రవారం ఉదయం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. ఆ కుక్కను వెంటనే గ్రామస్తులు చంపేశారు. బాలుడిని చికిత్స నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా గ్రామంలో కుక్కలు అధిక సంఖ్యలో తిరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను అదుపు చేయాలని కోరుతున్నారు.

కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో పెద్దపులి



కరగపాడు ప్రాంతంలో పెద్దపులి జాడ కోసం అమర్చిన సీసీ కెమెరాలు

గోపాలపురం, ఫిబ్రవరి 2: పెద్దపులి సంచారంతో మండల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. రెండురోజులుగా గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామశివారులోని గాడిచెరువులో ప్రవేశించిన పులి గురువారం సాయంత్రానికి జాతీయ రహదారిని అనుకుని ఉన్న మాతంగమ్మ మెట్ట వద్దకు చేరుకుని అర్థరాత్రి జాతీయ రహదారి దాటి ఉదయానికి సుమారు 5 కిలోమీటర్ల మేర ప్రయాణించి కరగపాడు శివారులో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌కు చేరుకున్నట్టు తూర్పుగోదావరి జిల్లా అటవీశాఖాధికారి ఎల్.ధనరాజు తెలిపారు. ఐదు కిలోమీటర్లు ప్రయాణించి అలసట చెందిన పులి ప్రస్తుతం కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో విశ్రాంతి తీసుకుంటున్నట్టు తెలిపారు. దీని జాడలు పసిగట్టేందుకు ప్రస్తుతం టైగర్‌టీమ్ పులిని వెంబడిస్తోందని, ఇక్కడ నుంచి పులి పాపికొండల వైపు ప్రయాణించే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

తాడిపూడిలో కనిపించినది పులా... పిల్లా..



మొక్కజొన్న తోట వద్ద పులి సంచారం

తాళ్లపూడి, ఫిబ్రవరి 2: పెద్దపులి తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలోని గోదావరి తీరంలో కనబడిందన్న విషయం సంచలనమైంది. కాగా శుక్రవారం మరో సారి అదే ప్రాంతంలోని మొక్కజొన్న తోట వద్ద సంచరించడం ఇసుక రీచ్‌లో పనిచేసే సిబ్బంది కంటపడింది. అయితే అది పులి కాదని, అడవి పిల్లి అని కొందరు చెబుతున్నారు. అది ఏ జంతువో తేల్చి చెప్పాల్సింది ఫారెస్టు అధికారులే. రీచ్ వద్ద పనిచేసే సిబ్బంది భయంతో వణికిపోతున్నారు.







గుడిసెలను కూల్చుతున్న బుల్డోజర్.. అధికారులకు సూచనలిస్తున్న ఏఎస్పీ

లక్ష్మీదేవిపేటలో 600 గుడిసెలు కూల్చివేత

- హైకోర్టు ఉత్తర్వులతో తొలగించిన రెవెన్యూ, పోలీసులు
- రెండేళ్ల కిందట రెండుచోట్ల 70 ఎకరాల భూమిలో గుడిసెల ఏర్పాటు

ఎటపాక, ఫిబ్రవరి 2: మండల కేంద్రమైన ఎటపాకలోని లక్ష్మీదేవిపేట రెవెన్యూ విలేజ్ పరిధిలో రెండుచోట్ల గత రెండేళ్ల కిందట ఆదివాసీలు నివాసం ఏర్పరుచుకున్న గుడిసెలు, రేకుల షెడ్లను శుక్రవారం తెల్లవారుజామున పోలీసు, రెవెన్యూ సంయుక్త ఆధ్వర్యంలో గుడిసెల తొలగింపు ఆపరేషన్‌ను నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వులు, అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తెల్లవారుజామున 3 గంటల సమయంలో బుల్డోజర్లతో పోలీసు బలగాలు అక్కడ చేరుకున్నాయి. గుడిసెల్లో ఆదివాసీలు నిద్రిస్తున్న సమయంలో, ఇంట్లోని సామగ్రిని ఖాళీ చేయించి, అనంతరం బుల్డోజర్లతో గుడిసెలు, రేకులషెడ్లను నేలమట్టం చేశారు. రెండేళ్ల కిందట విలీన మండలాలకు చెందిన ఆదివాసీలతోపాటు తెలంగాణలోని భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన ఆదివాసీలు ఇక్కడ భూమిని ఆక్రమించి గుడిసెలను ఏర్పాటు చేసుకున్నారు. గత రెండేళ్ల నుంచి ఈ గుడిసెల్లోనే నివాసముంటున్నారు. అయితే ఈ భూమిపై అన్ని హక్కులు ఉన్నాయంటూ కొందరు కొన్ని నెలల కిందట హక్కు పత్రాలతో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో భూమి గల యాజమానులకు అనుకూలంగా న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేయడంతో ఇటీవల రెండుసార్లు రెవెన్యూ అధికారులు ఆ భూముల్లో గుడిసెలు ఏర్పాటుచేసుకున్న ఆదివాసీలకు నోటీసులు కూడా అందజేశారని, అయినా స్పందించలేదని తహశీల్దార్ పృథ్వీ తెలిపారు. న్యాయస్థానం ఉత్తర్వులతో లక్ష్మీదేవిపేటలోని రెండుచోట్ల 70 ఎకరాల భూమిలోని 600 గుడిసెలు, రేకుల షెడ్లను కూల్చివేశారు. అయితే ఈ రెండుచోట్ల గుడిసెలు వేసిన వారిలో తెలంగాణకు చెందిన ఆదివాసీలు కూడా ఉన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బలవంతంగా గుడిసెలు కూల్చారని ఆదివాసీ మహిళలు పేర్కొంటున్నారు. ఈ భూమి తమకే చెందుతుందని, 2 సెంట్ల భూమికి తమ వద్ద నుంచి గిరిజన సంఘాల నాయకులు కొందరు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారని గుడిసెల ఏర్పాటుచేసుకున్న ఆదివాసీ పేర్కొంటున్నారు. గుడిసెలు వేసుకున్నచోట విద్యుత్, రహదారులు, డ్రైనేజీ కూడా నిర్మించి ఇస్తారని చెప్పారని తెలిపారు. అయితే గుడిసెల తొలగింపు సమయంలో ఆ ప్రాంతంలో భారీగా పోలీసు బలగాలు మోహరించారు. డాక్టర్ పాలరాజ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో లక్ష్మీదేవిపేటలో 100 గుడిసెలు, లక్ష్మీదేవిపేటలో మరో ప్రాంతంలో 500 గుడిసెలను కూల్చివేశారు. గుడిసెల తొలగింపు కార్యక్రమం ముగిశాక చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా ఆ ప్రాంతంకు వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గొడవలు, ఆందోళనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

అరెస్టు చేసినా ఆందోళన ఆగదు : మల్లాడి

యానాం, ఫిబ్రవరి 2: యానాం మత్స్యకారులకు సంబంధించి నష్ట పరిహారం విషయంలో మత్స్యకారుల తరఫున పోరాడుతున్న తనను అరెస్టు చేసినా పోరాటం ఆగదని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మత్స్యకార నాయకుడు మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం శివారు దరియాలతిప్ప-గిరియాపేట రోడ్డులో ఉన్న ఓఎన్జీసీ చమురు సంస్థ సమీపంలో యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమసంఘ నేతృత్వంలో ఈ మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులను ఉద్దేశించి మల్లాడి మాట్లాడారు. చమురు సంస్థల ద్వారా సీఎస్ఆర్ తీసుకువచ్చింది తనే అని గుజరాత్ పెట్రోలియం కార్పొషన్ నుంచి ఓఎన్జీసీ మారిన అంశాలతోపాటు అప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను వివరించారు. ముఖ్యంగా మత్స్యకారులకు చమురు సంస్థ ఇవ్వాల్సిన నష్టపరిహారం కాలయాపన చేయకుండా తక్షణమే విడుదల చేయాలన్నారు. ఇప్పటికే పుదుచ్చేరి ప్రభుత్వం అర్హులైన మత్స్యకారుల జాబితాలో ఇచ్చిన నివేదిక ఆధారంగా 5462మందికి 24నెలలకు 11,500 చెప్పున పరిహారం అందించాలన్నారు. ఇప్పటికైనా చమురు సంస్థ స్పందించి నగదును పుదుచ్చేరి ప్రభుత్వఖాతాలో జమచేయాలని లేకుంటే మరో రెండు మూడు రోజుల్లో మారో సమావేశం నిర్వహించి ఈ ధర్నాను ఉధృతం చేస్తామన్నారు. నష్టపరిహారం నగదును ప్రభుత్వం ఇవ్వకుంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని ఇప్పటికే ఈ నిర్ణయం సంఘం తీసుకున్న విషయాన్ని మల్లాడి తెలిపారు. పెద్దఎత్తున మత్స్యకారులు తరలిరావడంతో మూడురోడ్ల కూడలి జనసంద్రంగా మారింది. అనంతరం మల్లాడి కాకినాడలోని ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అదేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రత్యేక హోదా దీక్షలో పాల్గొన్న కామన

మండపేట, ఫిబ్రవరి 2 : ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ఏపీ భవన్ వద్ద పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా శుక్రవారం చేపట్టిన నిరవధిక దీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు పాల్గొన్నారు. ప్రత్యేక హోదా లక్ష్యంగా కాంగ్రెస్‌పార్టీ పనిచేస్తుందని కామనచెప్పారు. వైసీపీ, టీడీపీకి ప్రత్యేక హోదాపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రత్యేకహోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని కామన అన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 2: ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్పీ ఎస్.శ్రీధర్ శుక్రవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్, గ్రూప్-1 ఉద్యోగార్థులకు శిక్షణ ఇవ్వడాన్ని అభినందించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు, ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, బీఎస్సార్ ప్రసాద్, అంబటి త్రిమూర్తులు, ఉప్పే నరసింహారావు, మట్ట శ్రీనివాస్, గెడ్డం ప్రదీప్, పినిపే సత్యనారాయణ, రాజ్‌కుమార్, గుత్తాల రవి, నూకపెయ్యి గంగాధర్, బీర రవికుమార్ పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం న్యాయ పోరాట సమన్వయ కమిటీ క్యాలెండర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా డీఆర్వో సీహెచ్ సత్తిబాబు ఆవిష్కరించారు. ఏపీ మీడియా ఇన్‌చార్జి జీఎన్ రావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అరిగెల వెంకటరామారావు, కోనసీమ ఇన్‌చార్జి గోనెమడతల రవికుమార్ పాల్గొన్నారు.

'డిజిటల్ టెక్నాలజీని విద్యార్థులకు చేరువచేయాలి'

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 2: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతికతను అంది పుచ్చుకునేందుకు ప్రభుత్వం పాఠశాల విద్యలో డిజిటల్ టెక్నాలజీ ప్రవేశపెట్టిందని డీఈవో ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.మధుసూదనరావు పేర్కొన్నారు. పేరూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సిమ్యులేషన్ విధానంలో ప్రయోగాలు నిర్వహించడంపై గణిత ఉపాధ్యాయులకు ఒకరోజు ఓరియంటేషన్ తరగతిని శుక్రవారం నిర్వహించారు. హెచ్ఎం మట్టపర్తి పురుషోత్తమరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సిమ్యులేషన్ విధానంపై పూర్తిస్థాయి అవగాహన పొందాలన్నారు. తద్వారా విద్యార్థులకు ఐఎఫ్‌పీల సాయంతో ప్రయోగాలు చేయించాలన్నారు. సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలోని రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం, రాజోలు కేంద్రాలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఫిజికల్ సైన్స్, సోమవారం బయాలజీ సబ్జెక్టు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలోని 1,193 మంది గణితం, ఫిజికల్ సైన్స్, బయాలజీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. సమగ్ర శిక్షా ఏపీవో ఎంపీకే భీమారావు, ఎంఈవోలు జి.సూర్యప్రకాశరావు, ఎస్.దుర్గాదేవితోపాటు గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షా విధానంపై రేపు అవగాహన సదస్సు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 2: రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో గ్రూప్-2 పరీక్షా విధానంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఈ సదస్సులో పాల్గొని పరీక్షా విధానం, ప్రశ్నాపత్రాలు, ప్రామాణిక పాఠ్య పుస్తకాలు అంశాలను వివరిస్తారు. సదస్సుకు హాజరైన అభ్యర్థులకు భారత సమాజం అనే అంశంపై 128 పేజీల స్టడీ మెటీరియల్, ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే అంశాలపై వందపేజీల స్టడీ మెటీరియల్‌ను అందిస్తామన్నారు. వివరాలకు 8500644916,7901048912ను సంప్రదించాలని ఐవీ కోరారు.

మంత్రి, ఎంపీలచే అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

అల్లవరం, ఫిబ్రవరి2: మండల పరిధిలోని యెంట్రుకోన, కోడూరుపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ ప్రారంభోత్సవం చేశారు. రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, ఆరోగ్య కేంద్రాన్ని, యెంట్రుకోన-తాడికోన బీటీ రోడ్డును, గుబ్బలవారిపాలెంలో సీసీ రోడ్డును ప్రారంభించారు. మొల్లేటివారిపాలెంలో మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, కొనుకు బాపూజీ, తిక్కా ప్రసాద్, సర్పంచ్‌లు నడింపల్లి సుబ్బరాజు, తిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాస్, సాధానల వెంకట్రావు, రాయుడు విష్ణు, రాకాపు విజయలక్ష్మి, ఎంపీడీవో కృష్ణమోహన్, ఏఈలు జి.సంపత్, బి.కొండలరావు, ఏవో ఎస్వీవీ సత్యనారాయణ, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.46లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 2: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,46,186 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

392 మందికి వైద్యసేవలు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 2: అంగర పీహెచ్‌సీ పరిధిలోని కపిలేశ్వరపురం సచివాలయంవద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 392మందికి వైద్య సేవలందజేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ ప్రారంభించారు.

బూత్ కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలి

● ఇంటిగ్రేటెడ్ శిక్షణా శిబిరంలో మాజీ మంత్రి గొల్లపల్లి



మామిడికుదురు శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న గొల్లపల్లి

మామిడికుదురు, ఫిబ్రవరి 2: బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ, మన టీడీపీ, కుటుంబ సాధికార సారథులు, ఓటరు వెరిఫికేషన్ తదితర అంశాల గురించి బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు కోరారు. మామిడికుదురులో శుక్రవారం జరిగిన ఇంటిగ్రేటెడ్ శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీనివాస్, మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, సాగి పాపయ్యరాజు, వర్ధినీడి బాబ్జి, చాగంటి స్వామి, లంకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: శంకరగుప్తంలో సర్పంచ్, క్లస్టర్ ఇన్‌చార్జి రాపాక ఆనందకుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో మాజీమంత్రి గొల్లపల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బోళ్ల రాజేష్, బత్తుల గణేష్, పృథ్వి, బాలకృష్ణలు శిక్షణ ఇచ్చారు.ఎంపీపీ కేతా శ్రీనివాస్, చాగంటి స్వామి, యుగంధర్, నాగు, మునేశ్వరరావు పాల్గొన్నారు.

రాజోలు: శివకోటి గ్రామశాఖ అధ్యక్షుడు కడలి ఏడుకొండలు స్వగృహంవద్ద మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పొదలాడలో సర్పంచ్ కడలి సత్యనారాయణ స్వగృహంవద్ద క్లస్టర్ ఇన్‌చార్జి పితాని సూరిబాబు అధ్యక్షతన రాజోలు, సోంపల్లి, పొదలాడ, తాటిపాక గ్రామాల్లో క్లస్టర్-9 శిబిరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ శిక్షణను బత్తుల గణేష్, గన్ని పృథ్వి, బొమ్ము బాలకృష్ణలు ఇచ్చారు. ఎంపీపీ కేతా శ్రీను, చాగంటి స్వామి, ఎంపీటీసీలు ఉంద్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావు, కాండ్రేగుల భవానీ, మట్టపర్తి లక్ష్మి, బేతినీడి శ్రీనివాస్, దుర్గాప్రసాద్, గోపి, కడలి వెంకటరమణారావు పాల్గొన్నారు.

అంతర్వేది: రామేశ్వరం గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జి చెల్లింగి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన క్లస్టర్-1, 2 శిబిరాల్లో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ శిక్షణను బోళ్ల రాజేష్, బత్తుల గణేష్, గన్ని పృథ్వి, బొమ్ము బాలకృష్ణలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, చెల్లింగి లీలాశ్రీనివాస్, చాగంటి స్వామి, యెనుముల రమణ, కడలి వెంకటరత్నం, పిండి సత్యనారాయణ, కౌరు శ్రీనివాస్, అంతర్వేదిపాలెం పుల్లయ్య, రాధాకృష్ణ, టీడీపీ నాయకులుపాల్గొన్నారు.

కేశవరం అభివృద్ధి టీడీపీదే ఘనత : ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: మండలంలోని కేశవరం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వా నిదేనని ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. కేశవరంలో గ్రావెల్ దోపిడీ 14ఎకరాలు గ్రావెల్ కొండ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సుమారు రెండున్నర నెలలు దోపిడీ చేసి రూ.30 కోట్లు దోచేశారన్నారు. అక్కడ గ్రావెల్ తవ్వకాలు పరిశీలిద్దామని బయలుదేరితే పోలీసులు రానివ్వలేదు. ఎమ్మెల్సీ తోట టీడీపీ జనసేన వాళ్లు కేశవరం వస్తే ఎమ్మెల్యే వేగుళ్లపై కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేస్తారని బెదిరించారు. మండలంలోని కేశవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం స్థానిక నేతలతో కలిసివేగుళ్ల గ్రామంలో ఇంటింటా తిరిగి టీడీపీ జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. ఆయన వెంట స్థానిక టీడీపీనేతలు కర్రి తాతారావు, కంటిపూడి శ్రీనివాసరావు, గారపాటి శ్రీను, మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని మూలస్థానఅగ్రహారంలో టీడీపీ కొత్తపేట నియోజకవర్గ యువ నాయకుడు బండారు సంజీవ్ ఆధ్వర్యంలో శుక్రవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటి కీ తిరిగి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు గెలుపు ఖాయమంటూ భవిష్యత్ కార్యాచరణ కరపత్రాలను ప్రజలకు అందించారు. టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.



మండపేట: కేశవరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కె.గంగవరం: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తోందని తెలుగుదేశం పార్టీ నాయకుడు కాదా వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కూళ్ల, నరజాడ, తమ్మయ్యపాలెం, నీలగిరిపేట గ్రామాల్లో పర్యటించారు. అలాగే పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు టీడీపీ నాయకుడు డాక్టర్ కాదా వెంకటరమణ రూ.50వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు.

ఈతకోటను పారిశ్రామికవాడలా తీర్చిదిద్దుతా : బండారు

రావులపాలెం: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈతకోటను పారిశ్రామికవాడలా తీర్చిదిద్దుతామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం ఈత కోటలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. బండారు నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి వైసీపీ అరాచక పాలనను ప్రజలకు వివరించారు.

విద్యార్థీ మేలుకో... భవిష్యత్తును కాపాడుకో

టీడీపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజ్ 'విద్యార్థీ మేలుకో... భవిష్యత్తును కాపాడుకో' కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అలమూరు ఎంపీడీవోగా మేరీరోజ్

ఆలమూరు, ఫిబ్రవరి 2: ఆలమూరు ఎంపీడీవోగా ఎ.మేరీరోజ్ బాధ్యతలు స్వీకరించారు. ఆమె అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. మేరీరోజ్‌ను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు. ఇక్కడ పని చేసిన కె.జాన్‌లింకన్ నర్సీపట్నం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

తహశీల్దార్‌గా గోపాలకృష్ణ

ఆలమూరు తహసీల్దారుగా కె.గోపాలకృష్ణ కృష్ణా జిల్లా చల్లపల్లి నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఐపీ శెట్టిని పశ్చిమగోదావరి జిల్లా ఆచంట బదిలీ చేశారు.

ముమ్మిడివరం ఎంపీడీవోగా నర్సింగరావు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 2: ముమ్మిడివరం ఎంపీడీవోగా కె.వెంకటనర్సింగరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.వెంకటనర్సింగరావు బదిలీపై ముమ్మిడివరం వచ్చారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన జె.రాంబాబు విశాఖ జిల్లా నాతవరం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

మండపేట తహసీల్దార్‌కు సత్కారం

మండపేట, ఫిబ్రవరి 2: మండపేట మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ కృష్ణాజిల్లా మైలవరం బదిలీపై వెళుతున్న టి.రాజేశ్వరరావుకు కార్యాలయం సిబ్బంది శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. తహసీల్దార్‌గా రాజేశ్వరరావు ఆయన చేసిన సేవలను సహచర సిబ్బందితోపాటు, ప్రజాప్రతి నిధులు కొనియాడారు. ఆయనను సిబ్బంది సత్కరించి మూమెంటోను అందజేశారు.

మండపేట తహసీల్దార్‌గా సురేష్

మండపేట నూతన తహసీల్దార్‌గా బి.సురేష్ నియమితులయ్యారు. ఆయన కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆయన శనివారం లేదా సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారు.

ఎంపీడీవో కె.శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

కాట్రేనికోన, ఫిబ్రవరి 2: కాట్రేనికోన ఎంపీడీవోగా కె.శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కామవరపుకోట నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్.వెంకటాచలం రాంబిల్లి మండలం బదిలీ అయ్యారు.

అంబాజీపేట తహసీల్దారుగా విమలకుమారి

అంబాజీపేట, ఫిబ్రవరి 2: అంబాజీపేట తహసీల్దారుగా జె.విమలకుమారి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కృష్ణాజిల్లా నాగాయిలంక నుంచి బదిలీపై అంబాజీపేట వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారును డిప్యూటీ తహసీల్దారు పద్మనాగలక్ష్మి, ఆర్ఐ ఇబ్రహీంతో పాటు వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఆత్రేయపురం ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 2: ఆత్రేయపురం ఎంపీడీవోగా ఎస్.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాలకొల్లు నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన నాతిబుజ్జి బదిలీపై పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లారు.

మామిడికుదురు తహసీల్దార్‌గా మేరికమ్మ

మామిడికుదురు, ఫిబ్రవరి 2: మామిడికుదురు తహసీల్దార్‌గా ఎం.మేరికమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై మామిడికుదురు వచ్చారు. ఇప్పటివరకు మామిడికుదురు తహసీల్దార్‌గా పనిచేసిన రియాజ్‌హుస్సేన్ కృష్ణాజిల్లాకు బదిలీపై వెళ్లారు.

అల్లవరం తహసీల్దారు బదిలీ

అల్లవరం, ఫిబ్రవరి 2: అల్లవరం తహసీల్దారు నాదెండ్ల సాంబశివప్రసాద్ పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురం తహసీల్దారుగా బదిలీఅయ్యారు.

'అనర్హులకు ఎస్టీ కులధ్రువీకరణ చేయవద్దు'

అమలాపురంటౌన్, ఫిబ్రవరి 2: బీసీ కులాలుగా ఉన్న వారికి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఎరుకుల కులస్తులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. బీసీ(ఎ) జాబితాలో ఉన్న పరికముగ్గల, పాముల కులస్తులకు ఎస్టీ ఎరుకుల అని కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడాన్ని నిరసించారు. ఈవ్యవహారంపై నిజనిర్ధారణ జరిపి అర్హులైన ఎరుకుల కులస్తులను మాత్రమే ఎస్టీలుగా గుర్తించాలని, మిగిలిన వారికి ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేయరాదని డిమాండ్ చేశారు. నిరసనలో కౌన్సిలర్ బండారు గోవిందు, నాయకులు బండారు ఏడుకొండలు, అమలదాసు రమణ, ఉప్పు శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ, కమ్మసత్తి శ్రీనివాస్, మానుపూడి అప్పారావు, ఎ.పల్లపురాజు, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

వెంకన్న ఆలయం పరిశీలించిన ఇంజనీరింగ్ బృందం

యానాం, ఫిబ్రవరి 2: యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పునాదుల స్థితిగతులను పరిశీలించేందుకు తిరుపతి దేవస్థానంకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు బృందం యానాం వచ్చారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు,ఆలయపునఃనిర్మాణ కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా జిల్లా జట్టు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 2: నర్సరావుపేటలో జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూలుగేమ్స్-17 బాలికల క్రికెట్ విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి విజేతగా నిలిచినట్టు కోచ్ తోట రవి తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలను అమలాపురంలో నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీలకు వీరవిద్యశ్రీ, చరిష్మ, సలేహ, ప్రియాంకలు అమలాపురం నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా అమలాపురం పీడీ తోట రవి, మేనేజర్లుగా పి.విఘ్నేశ్వరుడు, నాగదుర్గలు వ్యవహరించగా పరిశీలకునిగా మండపేట హెచ్ఎం ఆర్.నాగకుమార్ వ్యవహరించారు. ప్రథమస్థానం సాధించిన జట్టును అధికారులు అభినందించారు.

సర్వే పనులను అడ్డుకున్న గ్రామస్థులు

మలికిపురం, ఫిబ్రవరి 2: గుడిమెళ్లంకలో రైల్వే లైన్ కోసం సర్వే చేస్తున్న అధికారులను శుక్రవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామ మధ్యగా ఉన్న మంచినీటి చెరువు మధ్యభాగం నుంచి రైల్వేలైన్ ఎలాట్‌మెంట్ ఇచ్చారు. ఈ రైల్వే లైన్ ఎలాట్‌మెంట్‌ను మార్చవలసిందిగా కోరుతూ సర్వే అధికారులను అడ్డుకుని గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రంగరాజు, చిట్టిబాబు, మాజీ సర్పంచ్ కలగత ఏసురత్నం బత్తుల ప్రసాద్, ముత్యాల శ్రీనివాసరావు, కంకటాల శ్రీనివాస్, కొణిదెల అన్నవరం, కె.చిట్టిబాబు, నరేష్, సీహెచ్ శ్రీరాములు పాల్గొన్నారు.

పట్టా కాగితం ఇస్తే ఇళ్లు కట్టేసుకున్నట్టా..!

● అడవులను తలపిస్తున్న ఊరు చివరన స్థలాలు
● స్థలాలు ఎక్కడో తెలియని పరిస్థితుల్లో లబ్ధిదారులు
● మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్ ధ్వజం

కొత్తపేట, ఫిబ్రవరి 2: 'జగనన్న ఇళ్ల స్థలాల పేరిట లబ్ధిదారులకు పట్టాలు ఇస్తే వారు ఇళ్లు కట్టేసుకొన్నట్టేనా... ఊరి చివర ఇచ్చిన స్థలాలు అడవులను తలపిస్తున్నాయి... లబ్ధిదారులకు నేటికీ అవి ఎక్కడ ఉన్నాయో తెలియదు. కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా ప్రచారాలకు మాత్రమే పనికి వస్తున్నాయి' అని వాడపాలెం సర్పంచ్ త్సామా బాబు ధ్వజమెత్తారు. ఎంపీపీ మార్గన గంగాధర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కొత్తపేట మండల పరిషత్ బడ్జెట్ సమావేశంలో ఆయనపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ పాలకమండలి లేనప్పుడే ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చామని, అయినా జగన్ ప్రభుత్వంలో గ్రామసభలు అవసరం లేదన్నారు. ఒక్క ఇల్లు అయినా నిర్మించారని బాబు ప్రశ్నించారు. మొదటి ఫేజ్‌లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, రెండో ఫేజ్‌లో ఇళ్ల నిర్మాణం తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక పూర్తవుతాయని ఎంపీపీ సమాధానం ఇచ్చారు. టీడీపీ ఎంపీటీసీ సిద్ధంశెట్టి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ మందపల్లి గ్రామం తాగునీటి ఎద్దడితో కొట్టుమిట్టాడుతోందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంకులు మంజూరైనా పనులు ఎందుకు మొదలు పెట్టలేదో చెప్పాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పద్మను ప్రశ్నించారు. వాటర్ ట్యాంక్ నిర్మించాల్సిన ప్రదేశం దేవ దాయ శాఖకు చెందినది కావడంతో నిర్మాణం చేపట్టలేకపోతున్నామని, పంచాయతీ స్థలం చూపిస్తే పనులు మొదలు పెడతామన్నారు. వాదోపవాదాల అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్ ఆదాయం రూ.29.12 కోట్లు, వ్యయం రూ.29.11 కోట్లు కాగా రూ.87,987 మిగులు బడ్జెట్ చూపించారు. 2024-25 అంచనా బడ్జెట్ ఆదాయం రూ.29.26 కోట్లు, అంచనావ్యయం రూ.29.25 కోట్లుగా అంచనా వేయడంతో సభ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. అనంతరం బదిలీపై వెళ్తున్న కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి, తహసీల్దారు జీడీ కిషోర్‌బాబును సత్కరించారు. సమావేశంలో జడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎంపీడీవో కె.వాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

ద్రాక్షారామ, ఫిబ్రవరి 2: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామ ఆరోగ్యకార్యదర్శుల అసోసియేషన్ శుక్రవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. 2019 నుంచి నిర్వహిస్తున్న ఆర్‌సీహెచ్ ఆన్‌లైన్ వర్కుకు సంబంధించి అలవెన్సులు ఇప్పటి వరకు చెల్లించలేదని ఇక నుంచి ఆర్‌సీహెచ్ ఆన్‌లైన్ వర్కు తాము చేయలేమని వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో రామచంద్రమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు ఈదూరి స్నేహలత, కార్యదర్శి సీతామహాలక్ష్మి, గ్రామ ఆరోగ్యకార్యదర్శులు పాల్గొన్నారు.

సున్ని జామియా మసీదు అధ్యక్షుడిగా బాజానీ

మామిడికుదురు, ఫిబ్రవరి 2: మామిడికుదురులోని సున్ని జా మీయా మసీదు అధ్యక్షుడిగా మసూద్ మొహిద్దీన్ ని నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సెక్రటరీగా సయ్యాద్ అబ్దుల్లాకలామ్, ఉపాధ్యక్షుడిగా హాజీనురిద్దీన్ అహ్మద్, కోశాధికారిగా అహ్మద్ అలిషాను ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్సీ

రాయవరం, ఫిబ్రవరి 2: మండలంలోని పసలపూడి గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. సుమారు రూ. 80 లక్షలతో నిర్మించిన చింతా కాటంరెడ్డి గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.35 లక్షలతో నిర్మించిన చింతా సుబ్బారాయుడు హెల్త్ కేర్ సెంటర్‌ను ఎమ్మెల్సీ ప్రారంభించారు. తొలుతగా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్సీ నివాళులర్పించారు. అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఏఎంసీ ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, సర్పంచ్ కడలి పద్మావతి, వైసీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్తలు చింతా బాబులు, చైతన్యరాజబాబు, ఉపసర్పంచ్ పి.సాయిరామ్మోహనరెడ్డి, ఎంపీటీసీ విజేత, సహకార సంఘం ఛైర్మన్ చింతా రామ్మోహనరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆత్రేయపురం, ఫిబ్రవరి 2: అంకంపాలెంలో రూ.2.90 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆర్బీకే భవనంతో పాటు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయి పథకాన్ని ప్రారంభించారు. 68 మంది మహిళలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు.

జనసేన పార్టీ మండల కార్యదర్శి ఉదయ్‌కృష్ణ మృతి



అంబాజీపేట, ఫిబ్రవరి 2: జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, ఆర్టిస్ట్ తొత్తరమూడి ఉదయ్‌కృష్ణ శుక్రవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆకస్మికంగా మృతి చెందారు. హృదయకృష్ణ భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉదయ్‌కృష్ణ పార్థీవ దేహం వద్ద ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జనసేనఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కొల్లి సూర్యారావు, పెదపూడి శ్రీనివాస్, మందా రాజేష్, నేదునూరి వీర్రాజు, పెద్దిరాజులు నివాళులర్పించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కడలి శ్రీయోగిశ్రీనివాసరావు



పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపివేసిన టిప్పర్లు

తూర్పులంకలో ఘర్షణ

● నిలిచినరోడ్డు పనులు

అల్లవరం, ఫిబ్రవరి 2: తూర్పులంకలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ వర్గీయులకు గ్రామస్తుల మధ్య ఘర్షణ ఉద్రిత్తకు దారితీసి రోడ్డు పనులు నిలిచిపోయాయి. రూ.1.30 కోట్లతో తూర్పులంక వద్ద రోడ్డు పనులు జరుగుతుండగా కడలి శ్రీయోగిశ్రీనివాసరావు రోడ్లు మలుపువద్ద ఎత్తు పెంచమని గుమస్తాను అడగడంతో ఘర్షణ చెలరేగింది. కాంట్రాక్టర్ వర్గీయుడు తనపై గేజు కొలిచే ఊసతో దాడిచేసి కొట్టాడని శ్రీనివాసరావు ఆరోపించారు. కాంట్రాక్టర్ వర్గీయులపై శ్రీనివాసరావు చెప్పుతో దాడికి పాల్పడ్డాడని వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం నుంచి రోడ్డు పనులు నిలిచిపోయాయి. వాహనాలను ఎవ్వరూ ధ్వంసం చేయకుండా అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ముందస్తుగా టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అల్లవరం ఆసుపత్రులో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావును దెందుకూరి సత్తిబాబురాజు, వాసర్ల వెర్రియ్య కడలి దుర్గాప్రసాద్, నార్గన శ్రీను తదితరులు పరామర్శించారు. అల్లవరం ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, తూర్పులంక గ్రామస్తులతో పలు దఫాలు చర్చలు జరిగాయి. కడలి శ్రీయోగిశ్రీనివాసరావుపై దాడికి పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేశామని, ముందస్తుగా టిప్పర్ లారీలను పోలీస్‌స్టేషన్ వద్దకు చేర్చామని ఎస్ఐ హరీష్‌కుమార్ విలేకరులకు తెలిపారు.

రవ్వ ప్లాంటు వద్ద కొనసాగుతున్న ఆందోళన

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 2: గ్రామాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన డిమాండ్లతో ఎస్.యానాం రవ్వ ప్లాంటు వద్ద శుక్రవారం ఉదయం నుంచి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగుతోంది. గతంలో పలుమార్లు ఆందోళన చేయగా జనవరి నెలలో అమలాపురం ఆర్డీవో ఎస్.యానాం వచ్చి జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో గ్రామ ముఖ్యులతో చర్చలు జరిపారు. చర్చల ఫలితం మాత్రం బహిర్గతం కాలేదు. దీనితో మళ్లీ ఆందోళన తప్పలేదని గ్రామస్తులు వ్యాఖ్యానించారు. కాగా రెవెన్యూ, పోలీసు అధికారులు ఆందోళనకారులతో చర్చించారు. ఈ నెల 13న మంత్రి విశ్వరూప్, కలెక్టర్ సమక్షంలో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అమలాపురం డీఎస్పీ అంబికాప్రసాద్ హామీ ఇచ్చారు. అయితే డీఎస్పీ స్వయంగా సంతకం చేసి హామీ పత్రం ఇవ్వాలని ఆందోళనకారులు కోరారు. డీఎస్పీ హామీ పత్రం ఇచ్చిన అనంతరం మాటమార్చి ఆందోళన విరమించేది లేదని గ్రామస్తులు స్పష్టంచేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఆందోళన కొనసాగుతోంది.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

పి.గన్నవరం, ఫిబ్రవరి 2: కె.ఏనుగుపల్లిలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్యకేంద్రాలను జడ్పీ ఛైర్మన్, నియోజకవర్గ ఇన్ చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులు కలిసి ప్రారంభించారు. సర్పంచ్ తోలేటి బంగారునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, నక్కా చినవెంకటేశ్వరావు, అడ్డగళ్ల వెంకటసాయిరాం, యల్లమిల్లి సత్యనారాయణ, కొక్కిరి రవికుమార్, డొమేటి దుర్గారావు, గంధం ఏసు పాల్గొన్నారు.

అధికారులు ప్రజా సమస్యలపై స్పందించాలి

మలికిపురం, ఫిబ్రవరి 2: ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో చేసిన పనులే వారికి కీర్తి ప్రతిష్ఠలు పెంచుతాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం మలికిపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎంవీ సత్యవాణి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ తన హయాంలో నియోజకవర్గాన్ని ప్రణాళికాబద్ధంగా అన్నిరంగాల్లోను అభివృద్ధి చేశానన్నారు. కేశనపల్లి, శంకరగుప్తం మధ్య, గుడిమెళ్లంకలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, విద్యుత్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ అనంతరం ఎమ్మెల్యే రాపాక పదవీ కాలం చేపట్టి ఐదేళ్లు పూర్తవ్వడంతో సత్కరించారు. సమావేశంలో జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కందికట్ల నిర్మల, ఎంపీడీవో ముత్యంనాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

రాజేశ్వరి సేవలు ప్రశంసనీయం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 2 : ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన గుణ్ణం రాజేశ్వరి సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ అంబటి భవానీ అన్నారు. ఇటీవల పదవీవిరమణచేసిన గుణ్ణం రాజేశ్వరి దంపతులను శుక్రవారం ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్ వాడ్రేవు శాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, హెచ్ఎం సీహెచ్ఆర్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణాన్ని సమిష్టిగా అభివృద్ధి చేద్దాం : చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం, ఫిబ్రవరి 2: పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధే ధ్యేయంగా రామచంద్రపురం పట్టణాన్ని అధికారులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. నూతనంగా కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ సమక్షంలో మున్సిపల్ కౌన్సిల్ హాల్‌నందు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ఆమోదం కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తొలుత 2024-25 సంవత్స రానికి మున్సిపల్ బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. 2024-25 ఏడాదికి ప్రారంభ నిల్వగా రూ.2,17,94, 140లుగా పేర్కొన్నారు. రాబడి ఆదాయంగా రూ. 11,04,00, 699లు కాగా, రాబడి ఖర్చును రూ.7,83,09,000,కాగా మిగులు రాబడి ఆదాయంగా రూ. 3,20,91,699లుగా చూపించారు. మూలధన ఖర్చులనిమిత్తం రూ.22, 31, 50000లు కాగా ముగింపు నిల్వ రూ.95,35,839లుగానూ అందులో స్పీ మ్స్ గ్రాంట్ల నిమిత్తం నిధులు రూ.6,29,783లుగా మినహాయించారు. సొంత వనరుల ముగింపు నిల్వ రూ.89, 06,056లుగా బడ్జెట్‌లో చూపించారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు ఎంపిక

రామచంద్రపురం, ఫిబ్రవరి 2: బాస్కెట్ బాల్ జూనియర్ జాతీయ స్థాయి పోటీలకు ఎ.పిజట్టు ప్రాతినిధ్యం వహించడానికి 12 మంది క్రీడాకారిణిలను ఎంపిక చేసినట్టు రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2వరకూ ఆంధ్రప్రదేశ్‌లో వివిధ జిల్లాల నుంచి క్రీడా ప్రతిభ క్రీడా ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణిలకు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

పాళ్లమ్మ అమ్మవారికి చిక్కం వారి విరాళం

మామిడికుదురు, ఫిబ్రవరి 2: ఈదరాడ గ్రామ దేవత పాళ్లమ్మ అమ్మవారికి మాజీ సర్పంచ్ చిక్కం రాంబాబు కుటుంబ సభ్యులు విరాళాలు అందించారు. ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా మాజీ సర్పంచ్ కుమారులు డాక్టర్ సత్యసంజీవ్, సురేంద్రలు రూ.లక్ష నగదుతోపాటు రూ.54వేల విలువ చేసే రెండు కంచు గంటలు, రూ.50వేలు విలువచేసే మూడు శిఖరాలతోపాటు అన్నసమారాధన నిమిత్తం బియ్యం అందించారు. వీటి విలువ సుమారు రూ.2.20లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు. చిక్కం కుటుంబ సభ్యులను గ్రామస్తులు, కమిటీవారు అభినందించారు.

బ్యాంకు ఖాతాల్లో నగదు మాయంపై కేసు నమోదు

రావులపాలెం, ఫిబ్రవరి 2: రావులపాలెం మండలంలోని పలువురి బ్యాంకు ఖాతాల్లో నగదు మాయంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పొడగట్లపల్లికి చెందిన పోలవరపు శ్రీనివాస్ తన ఖాతాలో రూ.9,900, ఈతకోటకు చెందిన మానే ప్రసాద్ తన ఖాతాలో రూ.9,900 నగదు మాయమైందన్నారు. కులగణన సమయంలో వేలిముద్ర వేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. రావులపాలేనికి చెందిన వెలగల రామేశ్వరరెడ్డి ఖాతాలో రూ.5వేలు నగదు మాయమైంది. కులగణన సర్వేలో ఓటీపీ చెప్పగా ఈ విధంగా జరిగిందన్నారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్టు తెలిపారు.

బ్యాంకు ఖాతాల్లో నగదు మాయంపై అధికారుల విచారణ

రావులపాలెం మండలంలో ఖాతాదారులకు తెలియకుండా వారి బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయమవుతోందని పలువురు ఆందోళనకు గురయ్యారు. ఈ వ్యవహారానికి సంబంధించి శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్డీవో ఎం.ముక్కంటి, ముఖ్య ప్రణాళికాధికారి టి.వెంకటేశ్వర్లు, కొత్తపేట డీఎస్పీ రమణ, స్థానిక అధికారులు, బ్యాంకు మేనేజర్లు పొడగట్లపల్లి వెళ్లి నగదు ఏ విధంగా మాయమైందో వివరాలు సేకరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ జయలక్ష్మి భాస్కరరావు

కొత్తపేట, ఫిబ్రవరి 2: కొత్తపేట మేజర్ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.24లక్షల వ్యయంతో సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ బూసి జయలక్ష్మిభాస్కరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ ధర్నాల రామకృష్ణ, దేవస్థానం మాజీ ఛైర్మన్ బండారు సూర్యనారాయణమూర్తి, యల్లమిల్లి జగన్మోహన్, కాశి ధనరాజు, బండి ధనరాజు, బయ్యే రాంబాబు, మిద్దే ఆదినారాయణ, కముజు వెంకటేశ్వరరావు, వాసంశెట్టి సత్యనారాయణ, బూసి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల విజయోత్సవ సభ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 2: పోరాడితేనే విజయాలు చేకూరతాయని అంగన్‌వాడీల పోరాటం రుజువు చేసిందని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గారావులు పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో ఎస్.దుర్గామహేశ్వరి అధ్యక్షతన శుక్రవారం జరిగిన అంగన్‌వాడీల పోరాట విజయోత్సవ సభలో వారు పాల్గొని మాట్లాడారు. 42 రోజుల పాటు అంగన్‌వాడీలు పోరాటం సాగించారని, ఆ పోరాటం ఫలితంగానే పది డిమాండ్లను సాధించుకోగలిగారన్నారు. ఈ సందర్భంగా మృతిచెందిన 13 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు నివాళులర్పించారు. కార్మికులంతా సభలో ఎం.జయలక్ష్మి మాట్లాడారు. సభలో విత్తనాల రాంబాబు, విప్పర్తి మోహనరావు, ఎస్.కనకదుర్గ, ఎం.విజయకుమారి, జి.మంగాయమ్మ, కె.వెంకటలక్ష్మి, వి.తలుపులమ్మ, సుభాషిణి, రమాదేవి, అరుణకుమారి, ధనలక్ష్మిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రామచంద్రపురం కమిషనర్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

రామచంద్రపురం, ఫిబ్రవరి 2: బాపట్ల జిల్లా అద్దంకి మున్సి పాలిటీ నుంచి బదిలీపై వచ్చిన బోగాని శ్రీనివాస్ శుక్రవారం రామ చంద్రపురం మున్సిపల్ కమిషనర్‌హగా బాధ్యతలు చేపట్టారు. గతంలో చీమకుర్తి, వినుకొండ, దర్శి,కనిగిరి మున్సిపాలిటీలలో, సెక్రటేరియట్‌లో పనిచేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 2: భవిత కేంద్రం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సమగ్రశిక్షా వారు సమకూర్చిన రూ.38వేలు విలువగల ట్యాబ్‌లను అందజేశారు. భవిత కేంద్రంలో 40 మంది విద్యార్థినీ విద్యార్థులకు హియరింగ్ ఇంపైర్‌మెంట్, దృష్టిలోపం కలిగిన విద్యార్థులకు 11 మంది విద్యార్థినీ విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారులు బొజ్జా రమణశ్రీ, ఆర్.ఉదయభాస్కర్‌లు వీటిని శుక్రవారం వారికి అందజేశారు.